క్లుప్తంగా

ఆర్థిక సాయం

రేగొండ: మండలంలోని భాగిర్థిపేట గ్రామానికి చెందిన బొచ్చు దినేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి పరామర్శించి, రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట ఫౌండేషన్ జాయింట్ సెక్రటరీ కొత్తపల్లి రాజు, సభ్యులు రాజు, అశోక్, నాగరాజు ఉన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థినుల ఎంపిక



గోవిందరావుపేట: నేషనల్ మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు మండలంలోని చల్వాయి మోడల్ స్కూల్ విద్యార్థినులు రక్షిత, జరుపుల వర్షిని, శ్రీవల్లిక ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ గండు కుమార్ మాట్లాడుతూ.. మోడల్ స్కూల్ చల్వాయిలో విద్యార్థులు సాధిస్తున్న విజయాలు చూసి పిల్లల తల్లిదండ్రులు మోడల్ స్కూల్లో అడ్మిషన్ పొందాలని అన్నారు. స్కాలర్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులను, ఉపాధ్యాయులు హారిక, మురళీకృష్ణ, ఎగ్జామినేషన్ బ్రాంచ్ రమేశ్‌లను ప్రిన్సిపాల్ అభినందిచారు. అనంతరం విద్యార్థులను శాలువాలతో సత్కరించారు.

వెంకటాపురం(కె)లో..



వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న పడాల రామ్‌చరణ్ నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యాడు. దీంతో అతడిని ప్రధానోపాధ్యాయుడు, ఎంఈఓ సత్యనారాయణ, తోటి ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సుజాత, జయరాం, శేషు, నర్సింహరావు, వెంకటేశ్, రాజేశ్వరరావు, వంశీతో పాటు తదితరులు ఉన్నారు.

మంటలార్పిన సిబ్బంది



వాజేడు: మండల పరిధిలోని కడేకల్ గ్రామ సమీపంలోని పొలాల్లో శనివారం చెలరేగిన మంటలను అటవీ శాఖ సిబ్బంది, ఫైర్ సిబ్బంది ఆర్పారు. గ్రామ సమీపంలోని పొలాల్లో చెలరేగిన మంటలు అడవిలోకి వెళ్లె క్రమంలో గుర్తించిన అటవీ శాఖ గార్డు రామ్మూర్తి, సిబ్బంది పంపులతో నీటిని చల్లి చల్లార్చారు.

'సరోత్తంరెడ్డిని గెలిపించాలి'

ఏటూరునాగారం: బీజేపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తంరెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, ఎమ్మెల్సీ జిల్లా ఇన్‌చార్జ్ వెన్నంపల్లి పాపయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తోందన్నారు. అనంతరం రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన బలరాంను నాయకులు సన్మానించారు.

నగదు అందజేత

వాజేడు: మండల పరిధిలోని పేరూరు ఆశ్రమ పాఠశాలలో హెడ్ కుక్‌గా పని చేస్తున్న దుబ్బ కృష్ణవేణి(50) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. దీంతో ఆమె దహన ఖర్చులకు ప్రభుత్వం ద్వారా వచ్చిన రూ.30 వేలను బాధిత కుటుంబానికి ఆశ్రమ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు బద్రి శనివారం అందజేశారు. కృష్ణవేణి భర్త లక్ష్మయ్య నెల రోజుల క్రితం మృతి చెందాడు. దీంతో మనోవేదనకు గురైన కృష్ణవేణి అనారోగ్యం భారిన పడి మృతి చెందిందని స్థానికులు తెలిపారు.

ప్రాజెక్టుకు మోక్షం ఎప్పుడో?



గండి పడ్డ ఆనకట్ట



తీగల వాగు ప్రాజెక్టు మత్తడి

- ఏళ్లుగా నిరుపయోగంలో తీగలవాగు ప్రాజెక్టు
- వైఎస్సార్ ఆశయానికి తూట్లు

మల్హర్: చిన్న నీటి వనరులను రక్షించాలనే ఉద్దేశ్యంతో 1975లో మల్హర్ మండలంలోని ఉమ్మడి పెద తూండ్ల గ్రామ పంచాయతీ సమీపంలోని తీగల వాగుకు అడ్డంగా ఆనకట్టను రూ.13లక్షల వ్యయంతో నిర్మించారు. కానీ 1978లో ఆనకట్టకు గండి పడడంతో ప్రాజెక్టులో నీరు నిలువలేదు. 1986లో కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. అప్పట్టి నుంచి ఈ ప్రాజెక్టును పట్టించుకున్న పాపాన పోలేదు. దాదాపు ఇరువై ఏళ్ల అనంతరం 2002లో రూ.1.40 కోట్లతో ప్రతిపాదనలు పంపినప్పటికీ అప్పటి ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జలయజ్ఞం కార్యక్రమం చేపట్టడంతో ఈ ప్రాజెక్టుకు మోక్షం లభించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా దివగంత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చేపట్టిన బస్సు యాత్ర సందర్భంగా ఈ ప్రాజెక్టు గురించి స్థానిక నాయకులు ప్రస్తావన తీసుకువచ్చారు. అనంతరం అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో 2006లో ప్రాజెక్టు ఆధునీకరణకు రూ.3.74కోట్లతో ప్రాజెక్టు పనులు చేపట్టేందుకు 456 జీఓను జారీ చేశారు. దీంతో టెండర్ ప్రక్రియ ముగిసిన తర్వాత పనులు ప్రారంభించారు. కాంట్రాక్టర్ పనుల నిర్వహణలో తీవ్ర అలసత్వం ప్రదర్శించడంతో రెండు నెలల కాలంలోనే కురిసిన భారీ వర్షానికి మరోసారి ఆనకట్టకు భారీ గండి పడింది. ప్రాజెక్ట్ పనులు పూర్తికాకుండానే గండి పడటంతో తమ తప్పును సమర్థించుకునేందుకు అధికారులు తప్పంతా కాంట్రాక్టర్‌పై నెట్టారు. కోట్లా రూపాయలతో నిర్మిస్తున్న ప్రాజెక్ట్‌ల పనీతీరు పర్యవేక్షించాల్సిన బాధ్యత ఆ శాఖ అధికారులపై ఉందనే విషయాన్ని మరిచిపోవడాన్ని రైతులు తీవ్రంగా విమర్శించారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు తీగల వాగును అనుసాంధనం చేస్తే మరమ్మతు పనులు జరిగే అవకాశం ఉంటుందని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే దీని కింద 1029 ఎకరాల భూమి సాగులోకి వస్తుంది.

ముంపు బాధితులకు పరిహారం

తీగల వాగు ప్రాజెక్టుకు గండి పడటంతో ప్రాజెక్ట్ కింద భూములు నష్ట పోయిన ముంపు రైతులకు నష్ట పరిహారం అందించారు. ప్రాజెక్టు కింద సమూరు 71 మంది రైతల వద్ద నుండి అధికారులు 84 ఎకరాలపై చిలుకు భూములను సేకరించి, పరిహారం అందించారు.

పనులు ప్రారంభించాలి



ఏళ్లుగా తీగుల వాగు ప్రాజెక్టు నిరుపయోగంగా ఉంది. ప్రాజెక్టు పనులు పూర్తయి అందుబాటులోకి వస్తే నీళ్లు మంచిగా వస్తాయి. రెండు, మూడు పంటలైన పండిస్తాం. పనులు ప్రారంభించి పూర్తి చేయాలి.

– సమ్మయ్య, రైతు, అడ్వాలపల్లి, మల్హర్

బాధలు తప్పతాయి



ప్రాజెక్టు ద్వారా పొలాలకు నీళ్లు వస్తే మాకు బాధలు తప్పతాయి. సాగు చేస్తే వాన వస్తదో రాదో అని ప్రతి సంవత్సరం భయపడుతున్నాం.తీగల ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే మాకు కావల్సినన్ని నీళ్లుంటాయి.

– మల్లయ్య, రైతు, అడ్వాలపల్లి, మల్హర్

నివేదిక సమర్పించాం..

పెదతూండ్ల తీగల వాగు ప్రాజెక్టు మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాం. మరోసారి పాత ప్రతిపాదనతో కలిపి నూతనంగా కూడా ప్రతిపాదనలు చేసి ఉన్నతాధికారులకు సమర్పించాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– రంజిత్, ఇరిగేషన్ ఏఈఈ, మల్హర్

కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



టేకుమట్ల: అనిల్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

చిట్యాల: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండలంలోని జూకల్ గ్రామంలోని ఓ ఫౌంక్షన్ హాల్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు ప్రతి గడప గడపకు వెళ్లి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ కార్పోరేషన్ చైర్మన్ ఐయిత ప్రకాశ్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవిసత్యం, రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ, మాజీ జెడ్పీటీసీలు ఓరం సమ్మయ్య, కాట్రేవుల సాయిలు, పులి తిరుపతి రెడ్డి, జిల్లా నాయకులు దొడ్డి కిష్టయ్య, దబ్బెట రమేశ్, మూల శంకర్‌గౌడ్, సుదర్శన్ గౌడ్, దబ్బెట అనిల్, కామిడి రత్నాకర్‌రెడ్డి, మల్లయ్య, రాయకొమురు, శరత్, లక్ష్మన్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

టేకుమట్ల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంవత్సరంలోనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు. పార్టీ మండల అధ్యక్షులడు కోటగిరి సతీశ్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, రవి, నాయకులు దొంతుల శ్రీనివాస్, అశోక్, సమ్మయ్య, చిరంజీవి, నాంపెల్లి వీరేశం, రామారావు, చింతలపెల్లి స్వామిరావు, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సన్మానం

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన కొలుగూరి అనిల్‌ను మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమాశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు

- ఎస్సై మ్యాక అభినవ్



మాట్లాడుతున్న ఎస్సై మ్యాక అభినవ్

కాటారం: అటవీ ప్రాంతాల్లో విద్యుత్ తీగలు, ఉచ్చులు అమర్చి అటవీ జంతువులనే వేటాడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ నాగరాజు, ఎస్సై మ్యాక అభినవ్ హెచ్చరించారు. గతంలో విద్యుత్ తీగలు అమర్చి వేటకు పాల్పడిన మండల కేంద్రంతో పాటు మండలంలోని గుండ్రాత్‌పల్లికి చెందిన నలుగురిని శనివారం తహసీల్దార్ ఎదుట అటవీ శాఖ అధికారులు బైండోవర్ చేశారు. అనంతరం ఎస్సై అభినవ్ వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. పంట పొలాల చుట్టూ, అటవీ ప్రాంతంలో విద్యుత్ తీగలు అమర్చడం, జంతువులను వేటాడడం నేరమన్నారు. అలాంటి వాటికి పాల్పడితే కేసులు నమోదు చేయడంతో పాటు భారీ జరిమానా విధిస్తారని పేర్కొన్నారు. గ్రామాల్లో విద్యుత్ తీగలు, ఉచ్చులు అమర్చే వారి సమాచారం ఉంటే అధికారులకు తెలుపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దామెరకుంట సెక్షన్ అధికారి చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి వేడుకలు



జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కాటారం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. అలాగే గిరిజన సంక్షేమ కళాశాలలో బంజారా సాంప్రదాయ పద్ధతిలో భోగ్ భండారో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహరాజ్ జీవితం ఆదర్శం అన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల డీసీఓ రాజేందర్, బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడు లావుడియా రమేశ్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ మాధవి, వెంకటయ్య, బంజార సంఘం నాయకులు రవీందర్‌నాయక్, రాములునాయక్, కిషన్ నాయక్, దేవ్‌నాయక్, సమ్మయ్యనాయక్, గోపి, పరంసింగ్, రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్

కాటారం: కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఆధ్వర్యంలో కాటారం పీఏసీఎస్‌లో పంట రుణం పొంది ప్రమాదవశాత్తు మృతి చెందిన రైతుకు సంబంధించిన బీమా చెక్కును శనివారం పీఏసీఎస్ పాలకవర్గం, అధికారులు బాధిత కుటుంబానికి అందజేశారు. మండలంలోని గంగారం గ్రామానికి చెందిన బొల్లం గణపతి అనే రైతు గారెపల్లి పీఏసీఎస్ శాఖ ద్వారా పంట రుణం పొందారు. పంట రుణం పొందే సమయంలో సంఘం ద్వారా ఇన్సూరెన్స్ చేయించారు. ప్రమాదవశాత్తు గణపతి మృతి చెందడంతో రూ.లక్ష ఇన్సూరెన్స్ క్లైమ్ కాగా పీఏసీఎస్ చైర్మన్ తోటపల్లి ప్రశాంత్, పాలకవర్గం సభ్యుల చేతుల మీదుగా బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఈఓ ఎడ్ల సతీశ్, కేడీసీసీబీ బ్యాంక్ మేనేజర్ హరిరామ్ నాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ వేమునూరి ప్రభాకర్ రెడ్డి, బ్యాంక్ సూపర్‌వైజర్ రాజిరెడ్డి, స్టాఫ్ అసిస్టెంట్ భాస్కర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అడవులను కాపాడుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వాజేడు: అడవుల్లో ఉండే చెట్లతోనే ప్రజలకు, ఇతర జీవాలకు స్వచ్ఛమైన గాలి అందుతుందని ప్రతి ఒక్కరూ అడవులను కాపాడాలని ఎఫ్ఎస్ఓలు నారాయణ, నాగమణి అన్నారు. మండల పరిధిలోని పూసూరు, ములుకనపల్లి గ్రామాల్లో శనివారం అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్ప పువ్వులు, చీపుర్లు సేకరించడానికి అడవికి వెళ్లిన ప్రజలు చెట్ల కింద సేద తీరే సమయంలో నిప్పు పెట్టవద్దన్నారు. ఒకవేల అడవిలో మంటలు అంటుకుంటే స్థానికులకు, అటవీ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో పాటు మంటలను ఆర్పే ప్రయత్నం చేయాలని కోరారు. అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లులు ఆపాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వాజేడు: అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ఆపాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ విజయలకు తెలంగాణ ఆదివాసీ సంఘం మండల నాయకుడు జెజ్జరి దామోదర్, బచ్చలి కృష్ణబాబు శనివారం వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2022–24 మధ్య కాలంలో మండలంలో సీసీ రోడ్లు, మన ఊరు–మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు సకాలంలో పూర్తి చేయలేదన్నారు. పనులు పూర్తి కాకుండానే బిల్లులను దక్కించుకోవాలని చూస్తున్నారని నిలుపుదల చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన సబ్ జూనియర్ కబడ్డీ రాష్ట్ర స్థాయి సెలక్షన్‌లో జెడ్పీహెచ్ఎస్ మొగుళ్లపల్లి పాఠశాల విద్యార్థి సంజయ్ ఎంపికయ్యాడు. వికారాబాద్ జిల్లాలో ఈ నెల 20, 21న నిర్వహించనున్న క్రీడల్లో పాల్గొననున్నట్లు పాఠశాల పీడీ రాజయ్య తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు విజయ్ పాల్ రెడ్డి, ఉపాధ్యాయులు భాగ్యశ్రీ , సురేందర్, కల్యాణి, అనిల్ కుమార్, కుమారస్వామి, ప్రవీణ్, పద్మ, లలిత, శ్రీకాళ, స్పందన సంజయ్‌ను అభినందించారు.

పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రదర్శన



కాటారం: జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు



మల్హర్‌లో..

కాటారం: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల తుదిజాబితాను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బాబు శనివారం విడుదల చేశారు. కార్యాలయం ఆవరణ లోని నోటిస్ బోర్డులో పోలింగ్ కేంద్రాల జాబితా వివరాలు ప్రదర్శించినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పిల్లి వీరస్వామి, పంచాయితీ కార్యదర్శులు షగీర్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

మల్హర్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల తుది ఓటర్ జాబితాను ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ శ్యామ్ సుందర్ ప్రదర్శించారు. మండలంలో 7 ఎంపీటీసీ స్థానాలకు గాను 46 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన మండల వ్యాప్తంగా 22573 ఓటర్లతో కూడిన తుది జాబితాను ఎంపీడీఓ కార్యాలయంలో ప్రచురించినట్లు ఎంపీడీఓ చెప్పారు.

ప్రకృతి వనంలో చెట్ల నరికివేత



పల్లె ప్రకృతి వనంలో నరికివేసిన చెట్లు

కాటారం: మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని లింగయ్యకుంటలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో ఏపుగా పెరిగిన చెట్లను పలువురు వ్యక్తులు నరికివేశారు. లింగయ్యకుంట ప్రభుత్వ భూమి అక్రమణకు గురవుతుండటంతో గత ప్రభుత్వ హయాంలో ఎనిమిది ఎకరాల్లో పల్లె ప్రకృతి వనం నిర్మించారు. ఇందులో భాగంగా పలు రకాల చెట్లను నాటడంతో అవి ఏపుగా పెరిగి ప్రకృతివనం పచ్చదనంతో నిండుకుంది. కాగా పలువురు వ్యక్తులు భూమిని ఆక్రమించుకోవడానికి చెట్లను నరికినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో నాటిన చెట్లను నరికినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి చెట్లను నరికివేసి ఆక్రమణకు పాల్పడడానికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. చెట్ల నరికివేత సంఘటనపై పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హాస్టళ్లు ఏర్పాటు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవితేజ

ఏటూరునాగారం: మండల కేంద్రంలో ఎస్సీ, బీసీ ఎస్ఎంఎస్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జాగటి రవితేజ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన భారత విద్యార్థి ఫెడరేషన్ మండల కమిటీ సమావేశంలో రవితేజ మాట్లాడారు. ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ కేంద్రంలో ఆరు మండలాలు ఉన్నాయన్నారు. డివిజన్ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, ఐటీఐ కళాశాలలు ఉన్నా విద్యార్థులకు హాస్టల్ లేకపోవడం వల్ల విద్యార్థులు చదువు దూరమవుతున్న అన్నారు. కార్యక్రమంలో బట్ట స్వామి, నర్సింగరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు



వాజేడు: ఇసుక క్వారీని పరిశీలిస్తున్న ఎస్సై



ములుగు రూరల్: తనిఖీ చేస్తున్న పోలీసులు



వెంకటాపురం(కె)లో..

- ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్

వాజేడు: ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టపరంగా చర్యలను తీసుకుంటామని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్ అన్నారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం మండల పరిధిలోని రాంపురం, భీమవరం ఇసుక క్వారీలను తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీడీలో ఉన్న దాని కంటే ఎక్కువ లోడ్ చేసినా, ఒక లారీకి బదులు మరో లారీలో ఇసుక తరలించినా, జేసీబీతో నింపే సమయంలో డబ్బులు వసూలు చేసినా చట్ట పరంగా చర్యలను తీసుకుంటామని తెలిపారు.

ములుగు రూరల్: ములుగు మండలంలోని మల్లంపల్లి వద్ద శనివారం వాహనాలను తనిఖీ చేసినట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. ఇసుక లారీల్లో జీరో వెహికల్స్, ఓవర్ లోడింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా ఒక లారీ ఓవర్ లోడ్‌తో రాగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వెంకటాపురం(కె): మండల పరిధిలోని చొక్కాల, సూరవీడు, ఆలుబాక ఇసుక క్వారీలను వెంకటాపురం(కె) ఎస్సై కొప్పుల తిరుపతిరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమ డంపింగ్, ఓవర్ లోడింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వీరభద్రవరం గ్రామ సమీపంలో ఇసుక లారీలను తనిఖీలు చేశారు. ఆయన వెంట సివిల్, సీఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు ఉన్నారు.

అనుమతులు లేకుండా తరలిస్తే చర్యలు

మండలంలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ లక్ష్మిరాజయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాగులు, వంకలు, గోదావరి నుంచి ఇసుకను అక్రమంగా తవ్వకాలు సాగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



ఫోన్‌ను అందజేస్తున్న ఎస్సై వెంకటేశ్

కన్నాయిగూడెం: మండలంలోని తుపాకులగూడేనికి చెందిన సుస్మిత ఫోన్ ఇటీవల చోరీకి గురైంది. దీంతో ఆమె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ రికవరీ చేశారు. ఈమేరకు బాధితురాలికి శనివారం ఎస్సై ఎస్సై వెంకటేష్ అందజేశారు.